# భగవద్గీత సంక్షిప్త పరిచయం

## (యువత వ్యక్తిత్వ వికాసానికి)



ఎల్.వి. గంగాధర శాస్త్రి

డా॥ రేమెళ్ళ అవధానులు

శ్రీ వేదభారతి

# భగవద్గీత సంక్షిప్త పరిచయం

## విషయసూచిక


ముందుమాట

1వ భాగం 11

భగవద్గీత గురించి

2వ భాగం 19

వ్యక్తిత్వ వికాసానికి ఉపదేశాలు

3వ భాగం 49

సందేహాలు – సమాధానాలు

# ముందుమాట

ప్రపంచంలోని అత్యధిక ప్రాంతం అజ్ఞానాంధకారంలో మునిగిపోయి ఉన్న సమయంలో భారతదేశం ఆధ్యాత్మిక విద్యా కేంద్రంగా విరాజిల్లింది. "అధ్యాత్మము" అంటే "తనను గురించిన విశ్లేషణ" అని స్థూలంగా అర్థము. "అధ్యాత్మవిద్య" అంటే "తనను గురించి చెప్పే విద్య", లేక, వ్యక్తి యొక్క నిజ స్వభావాన్ని తెలియజేసే విద్య అని అర్థం. ఇంకా సరళంగా చెప్పాలంటే - మనము ఎవరము? మన నిజ స్వరూపం ఏమిటి? ఎక్కడి నుండి వచ్చాము? ఎక్కడికి వెళ్ళుతున్నాము? ఎక్కడికి వెళ్ళాలి? అందుకు ఏమి చెయ్యాలి? ఈ ఆధ్యాత్మిక విషయాలను సూటిగా చెప్పే ఉపనిషత్తుల సంక్షిప్త స్వరూపమే భగవద్గీత!

అర్జునుని విషాదం వలన కృష్ణ పరమాత్మ గీతను బోధించవలసి వచ్చింది. యుద్ధంలో తన వాళ్ళందరూ మరణిస్తారన్నది అర్జునుని విషాదానికి మొదటి కారణం. ఇది మమకారానికి చిహ్నం. తానే వారందరినీ చంపవలసి వస్తుందని భావించడం విషాదానికి రెండవ కారణం. ఇది అహంకారానికి చిహ్నం. వీటి పర్యవసానంగా "యుద్ధం చెయ్యడం" అనే తనకు విధించబడిన ధర్మాన్ని చేయనని అన్నాడు. అంతే కాదు తనకు విధించబడని "భిక్షాచర్య" రూపమైన అధర్మాన్ని చేస్తానని అన్నాడు. ఈ పరిస్థితులలో అర్జునునికి ధర్మాధర్మాలను వివరించి, అతని

కర్తవ్యాన్ని తెలియజేసి, అతని స్వాభావికమైన ధార్మిక ప్రవృత్తిని పునరుద్ధరించడానికి శ్రీకృష్ణుడు చేసిన ప్రయత్నమే భగవద్గీత. పైగా, జరుగుతున్న యుద్ధం వ్యక్తుల మధ్య కాదని, ధర్మానికి అధర్మానికి మధ్య అని, చనిపోయేది శరీరమే గాని ఆత్మ కాదని, శాశ్వతమైన ఆధ్యాత్మిక తత్త్వాన్ని గీతా రూపంలో బోధించాడు.

ఒక కాలానికి, ఒక ప్రాంతానికి చెందిన, పరిమితమైన మనుష్యులయొక్క అభివృద్ధిని కోరుకుంటూ తగిన మార్గాలను బోధించేవాడు గురువు అవుతాడు. సర్వ దేశాలకు, సర్వ కాలాలకు, సర్వ జాతులకు వర్తించే విధంగా జగత్తులోని ప్రతి మానవుణ్ణి ఉద్దేశించి ఇహపర లోకాలలోని అభివృద్ధికి మార్గాలను మహోదాత్తమైన పద్ధతిలో, విశ్వజనీనమైన రూపంలో ఉపదేశిస్తే జగద్గురువు అవుతాడు. ఈ విధమైన ఉపదేశాన్ని అందించడం ద్వారా శ్రీకృష్ణుడు జగద్గురువు అయ్యాడు.

ఏది చదుకున్న తర్వాత, ఇంకా చదువుకోవడానికి మిగిలి ఉంటుందో అది విజ్ఞానం. ఏది తెలుసుకున్న తర్వాత, మరొకటి తెలుసుకునేందుకు మిగిలి ఉండదో అది జ్ఞానము. అదే ఆధ్యాత్మిక జ్ఞానం. భగవంతుడు మన కోరికలను బట్టి ఫలాలను ఇవ్వడు. మన అర్హతను బట్టి ఇస్తాడు. శరణాగతి చేసిన వానిని అనుగ్రహిస్తాడు. అందుకే అర్జునునికి జ్ఞానాన్ని గీతోపదేశ రూపంలో ప్రసాదించాడు.

**అసలు భగవద్గీత ఏమి చెబుతోంది?**

ధర్మాధర్మాలను గురించి చెబుతుంది.

కర్తవ్యం గురించి చెబుతుంది.

కోరికలను అదుపులో పెట్టుకోమని చెబుతుంది.

ఆనందంగా జీవించడం ఎలాగో చెబుతుంది.

ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో చెబుతుంది.

పరమాత్మకు ఎవడు ఇష్టుడో చెబుతుంది.

ఆయనను చేరే మార్గాన్ని చూపిస్తుంది.

మనిషిని దైవంగా చూస్తుంది, చేస్తుంది.

కర్మణ్యేవాధికారస్తే.... అంటూ ఫలితంపైన దృష్టి పెట్టకుండా త్రికరణ శుద్ధిగా కర్మను ఆచరించమని చెబుతుంది.

ఉత్తమ లక్ష్య సాధన కోసం ఏ క్షణంలోనైనా, ఎలాంటి త్యాగమైనా చేయడానికి సంసిద్ధంగా ఉండాలని, అనన్యమైన భక్తితో ఫలితాన్ని పరమాత్మకు అర్పించి, భవబంధాలను వదలి, పనిచేయడం మనిషి కర్తవ్యమని బోధిస్తుంది.

న హి జ్ఞానేన సదృశం..... అని అంటూ జ్ఞానంతో సమానమైనది, పవిత్రమైనది ఈ ప్రపంచంలో మరొకటి ఏదీ లేదని, కాబట్టి జ్ఞానివి కమ్ము అని మనందరిని ఆశీర్వదిస్తుంది.

**ఇదీ గీతా సారాంశం!**

భగవద్గీతను గురించి కుతర్కాలు చేసే కొందరు, యుద్ధం ప్రారంభం కాబోయే సందర్భంలో 700 శ్లోకాలతో ఉన్న భగవద్గీతను శ్రీకృష్ణుడు బోధించడం సాధ్యం కాదని, కొన్ని మాత్రమే శ్రీకృష్ణుడు బోధించి ఉంటాడని, ఎక్కువభాగం వ్యాసమహర్షి వ్రాసి ఇరికించి ఉంటాడని వితండవాదం చేస్తున్నారు. కాని ఈనాడు భగవద్గీతను సుమారు ఒక గంట సమయంలో మనవంటి సామాన్యులు కూడా పారాయణ చేయడం సాధ్యం అవుతున్నపుడు, సంస్కృతం మాతృభాషగా ఉన్న ఆ రోజులలో పరమాత్మ రూపంలో ఉన్న శ్రీకృష్ణుడు, సూక్ష్మగ్రాహి అయిన అర్జునునకు, అతి తక్కువ సమయంలో సంపూర్ణంగా భగవద్గీతను బోధించడం అసాధ్యం కాదు. పైన పేర్కొన్న వితండవాదం అసత్యమైన కారణంగా, దీనిని తీవ్రంగా ఖండించడం జరిగింది.

భగవద్గీతను గురించిన కొన్ని విషయాలను మూడు భాగాలుగా ఈ పుస్తకం ద్వారా అందించడం జరిగింది.

అందులో మొదటి భాగంలో, భగవద్గీతను గురించి, శ్రీకృష్ణుని గురించిన విషయాలు సంక్షిప్తంగా ఉన్నాయి.

రెండవ భాగంలో, యువతకు, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే ఉపదేశాలను సంకలనం చేయడం జరిగింది. ఈ ఉపదేశాలతోబాటు, సాధికారికంగా వాటిని బోధించడానికి వీలుగా, సంబంధిత శ్లోకాలను, వాటి తాత్పర్యాలను ఇవ్వడం జరిగింది.

మూడవ భాగంలో, అనేక విశిష్టమైన అంశాలకు సంబంధించిన సందేహాలకు భగవద్గీతలోని సమాధానాలను పొందిక చేయడం జరిగింది.

నేటి యువతకు, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల పేరిట ఏవేవో నేర్పుతున్నారు. కాని, నిజానికి, కొన్ని వేల సంవత్సరాల నుండి మహాత్మాగాంధీ వంటి అసంఖ్యాకులైన మహానుభావుల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దిన భగవద్గీతను సందేశాత్మకంగా బోధించాలి.

భగవద్గీత వంటి కర్తవ్య బోధనా గ్రంథం లేకపోతే ప్రపంచ వాఙ్మయం పరిపూర్ణమైనట్లు కాదు అని అంటాడు ప్రపంచ ప్రముఖ తత్త్వవేత్త ఎడ్విన్ ఆర్నాల్డ్.

విదేశాలలో దీనిని ఇప్పటికే విద్యార్థులందరికీ పాఠ్యాంశంగా చేస్తున్నారు. అధికారులకు దీని ఆధారంగా ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. మనదేశంలో కూడా భగవద్గీతను అతి విస్తృతంగా ప్రచారం చేయవలసి ఉంది. శిక్షణను ఇయ్యవలసి ఉంది. శ్రద్ధతో గీతను అధ్యయనం చేసి, ఆ మార్గంలో ప్రయాణిస్తే, మన దేశాన్ని, వ్యక్తులను పట్టి పీడిస్తున్న పెను సమస్యలు వెంటనే మటుమాయమవుతాయి.

**దానికి కారణం –**

భగవద్గీత ఒక ఉత్తమ జీవన విధానం!

ఉన్నత వ్యక్తిత్వ వికాస గ్రంథం!

మానవులకు ఆశాదీపం!

సాధకులకు కల్పవృక్షం!

విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, సమాజంలోని మిగిలిన అన్ని వర్గాలవారు కూడా వారివారి అభ్యున్నతికి, గీతను గురించి కొంచెమైనా తెలుసుకోవాలి. కొన్ని అంశాలనైనా ఆచరించాలి.

ప్రశ్నలు సమాధానాల రూపంలో సిద్ధం చేయబడిన ఈ భగవద్గీతా సంక్షిప్త పరిచయం ఏ కొద్దిమందికైనా ఆ దిశలో సహాయపడితే, మా కృషి ధన్యతను పొందిందని సంతోషిస్తాము.

– ప్రకాశకులు